# అతను ఆమె నేను

అను

# కెటలిస్టు కథ

పైడిపాల

మనుషులు కొంతమంది తప్పు చేస్తారు. మనుషులే మరికొంత మంది తప్పు చెయ్యరు. ఈ మరి కొంత మంది ముఖ్యంగా మూడు రకాలు. పాపభీతితో తప్పుచెయ్యని వాళ్ళు మొదటి రకం. సామాజిక భయంతో తప్పు చెయ్యని వాళ్ళు రెండో రకం. చట్టానికి భయపడి తప్పుచెయ్యనివాళ్ళు మూడోరకం.— ఈ భయాలే లేకపోతే మనిషి స్వరూపం మరోలా వుండేది

ఫస్ట్‌టర్మ్ సెలవల తర్వాత పుస్తకాలమీద చెయ్యిచేసుకోవలసిన అవసరం కనిపించి లైబ్రరీకేసి నడుస్తున్నాను లైబ్రరీ అవుట్‌గేట్ దగ్గర బస్సుకోసం నిల్చున్న అమ్మాయిల ఎక్స్‌రే చూపులకుతట్టుకోలేక సిగ్గుతో కుంచించుకు పోయి కాళ్ళు కదకళినృత్యం చేస్తోంటే అడుగులులెక్క పెడుతున్నాను అదే అమ్మాయైతే పదిమంది అబ్బాయిలున్నా తల వంచుకునైనా వాలుచూపులు విసిరేస్తు కలహంసలా గలగలా నడిచి పోయేది. ఆడవాళ్ళ ధైర్యంమీద అదేపనిగా ఆలోచిస్తున్న నా ఆలోచనలు చిరునవ్వుల సవ్వడికి. సిగ్గు పడి పోయాయి.

"అబ్బ! నడుస్తున్నప్పుడు కూడా ఈ లోకంలో వుండక పోతే ఎలా, క్లాసులో ఎలాగూలేదు" అంటూ కళ్ళను చక్రాల్లా తిప్పుతూ నన్ను నిలేసింది ఎదురుగా వస్తున్న శైల. ఆమె పక్కనే మరో అమ్మాయి నా ఆలోచనలకి మళ్ళీ పనికలిగిస్తూ

ఒయ్యారంగా నిలుచుంది. మాకెంతో కాలంనుంచి పరిచయమున్నంత నిశితంగా ఆమె నాకేసి చూస్తోంది. ఆమె నిదివరకు చూసిన గుర్తులేదు ఆశ్చర్యంగానే వుంది.

"ఏవిటలా చూస్తారు నేను మీ క్లాసుమేటు శైలని" ఆటలు పట్టిస్తోంది. ఏవసగలను ఆడపిల్ల అందులోనూ అందమైంది!

"అదికాదు...." మాటలు తడబడుతున్నాయి. కౌంటర్ జోక్ ఇకెలా పేలతాయి?

"దీన్నెప్పుడూ చూళ్ళేదా మీరు? దీనికి మీరు బాగా తెలుసు...." మరీ ఆశ్చర్యంగా వుంది.

అందమైన ఆడపిల్లల పెదవులను నవ్వు వదల్లేక పోతోంది.

"పేరు గీత. తెలుగు ప్రీవియస్...." సుకుమారంగా చేతుల్ని జోడించిన ఆమెకి వీలయినంత మృదువుగా ప్రతినమస్కారం చేశాను.

"యూనివర్సిటీకి రాకముందు నుంచీ మీ రచనలు చదువుతోందట ఇక్కడ కొచ్చిన తర్వాత మిమ్మల్ని కలుసుకోవాలని ఒకటే తహ తహ. పరిచయం చెయ్యమని చంపేస్తోంది కాలేజి ఒకటి కాకపోవడం వల్ల ఇంతవరకు వీలు కాలేదు. అంది శైల పరిచయాన్ని పొడిగిస్తూ.

"అవును. మీ పేరు విన్నాను. మీరు కథలు రాస్తుంటారని కూడా తెలుసు" గీతను చూసిన తర్వాత ఆమె పేరు అంతవేగంగా యూనివర్సిటీ అంతటా వ్యాపించడంలో ఆశ్చర్యమేమీ లేదనిపించింది.

"మీతో మాట్లాడే అవకాశం ఇంతవరకు కలగలేదు కాని మిమ్మల్ని నేను కాలేజీలో చేరిన మర్నాడే చూశాను. నేనూ సుజాత క్యాంటీన్‌కి వెళ్తుతుంటే మీరు వస్తున్నారు. ఆరోజు మీరు వేసుకున్న షర్ట్ కూడా ఇంకా గుర్తుంది నాకు. లైట్ బ్లూకలర్ టెరికాటన్. ఆ తర్వాత బీచ్‌లోనూ, సూపర్ బజార్ దగ్గర, లీలామహల్లోను నాలుగైదుసార్లు చూశాను. పరిచయం చెయ్యడానికెవరూ లేక ఇంత వరకు ఆగాల్సొచ్చింది."

నా సెంటర్లన్నీ పసిగట్టేసిందే- సి. ఇడిలా!-

—అసాధ్యురాల్లా వుంది. గట్టిగా ఓనెల్రోజులు పరిచయ ముంటే ఈ తాగులు చొక్కాలు లెక్కట్టే పిల్ల దగ్గర నాబండారమంతా బయట పడి పోతుంది!

"మిమ్మల్నిదే నేను మొదటిసారి చూడ్డం" కథల్రాసే అమ్మాయిదగ్గర ఈమాత్రం సంజాయిషీ ఇచ్చుకోక పోతే ప్రమాదమే మరి. అబ్బాయిల కథల్ని ఎవరూ అట్టే పట్టించుకోరు గాని తెలిసిన అమ్మాయిల కథల్లో అంతరార్థాల కోసం అక్షరం అక్షరం పరిశీలించే వాళ్ళుంటారు!

"ఆవిషయం మీరు వేరే చెప్పనక్కర లేదు రెండేళ్ళనుంచి కలసి చదువుకున్నా క్లాసులో అమ్మాయిల్ని కొంతమందిని చూసుండరు మీరు" నామంచితనం మీద కైలకున్న దారుణమైన నమ్మకానికి జోహార్లర్పించ వలసిందే!

"అయితే సూడండి 'మంచి బాలుడు' గారు; మీ మంచి తనాన్ని ఎక్స్ప్లాయిట్ చేసేసు కుంటున్నా ననుకోక కాస్త ఓపిగ్గా నాకథలు విని మీ అభిప్రాయమూ సలహాలూ తెలియజెయ్యాలి. పరిచయమైన మొదటి క్షణంలోనే మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను కదూ. నేను చాలా స్వార్థపరురాల్ని" నిస్సంకోచంగా నిస్సిగ్గుగా మాట్లాడేస్తోంది-గీత.

"మీలా ఇంతచనువుగా మాట్లాడేవాళ్ళంటే నాకూ్కడా సరదా. నేనేం పెద్దరచయితను కాదుగాని. విని నిష్కర్షగా అభిప్రాయం చెప్పడానికే అభ్యంతరం లేదు' అవకాశాన్ని జారవిడుచు కోవడం నాకూ ఇష్టంలేదు.

"అమాత్రంచాలు మీరు నిర్మొహమాటంగా మాట్లాడతారని తెలిసే మీశిష్యరికం కోరుతున్నాను సైన్సువాళ్ళు కదూ మీకు తీరికుండదను కుంటాను. వచ్చే ఆదివారం మీకేం అపాయింట్మెంట్స్ లేవుకదూ?"

"అత్యవసరమైన వేంలేవు వీలవుతుంది లెండి" అన్నాను ఆలోచించినట్టు పోజుపెట్టి. అమాత్రం త్యాగం చెయ్యగలను అనే అర్థాన్ని అందులో పెడుతూ.

"మీకభ్యంతరం లేకపోతే మా హాస్టల్లో కూర్చుందాం, గార్డెన్లో ప్రశాంతంగా వుంటుంది ఏమంటారు?"

" అలాగే నాలుగున్నర కొస్తాను మీరు వెయిట్ చేస్తుంటారు కదూ"

" తప్పకుండా. మీ ఓపికకు మెచ్చుకోవాలి. M. Sc. చదువుతూ ఇంతసాహిత్య కృషి చేస్తునందుకు మీమీద అసూయగావుంది ఆర్ట్సు వాళ్ళం. మాకా వీలు చిక్కడంలేదు. గీత ఓపట్టాన వదిలేలా లేదు. అదే పనిగా మాట్లాడుకుంటున్నమమ్మల్ని చూస్తూ లైబ్రరీ కెళుతున్నవాళ్ళు వస్తున్నవాళ్ళు నాలుగైదు గుంపులుగా బయట నిల్చుండి పోయారు —అమ్మాయిలు కాదు.... అబ్బాయిలు!

" లైబ్రరీ కేంపస్ తిరునాళ్ళయే ప్రమాద ముంది. వస్తానుమరి" అన్నాను అడుగు ముందుకు వేస్తూ

" ఆదివారం తప్పనిసరిగా హాస్టలు కొస్తారుకదూ" ప్రోగ్రామ్ అనౌన్సర్ స్టాయిలో అనేసి వాళ్ళ మధ్యనుంచి దీపశిఖలా నడిచి పోయింది గీత!

(అవతలవాళ్ళ మొహాలు తగల బడ్డ తాటాకుల్లా అయ్యాయని వేరే చెప్పాలా?)

ఆరోజు ఆదివారం. నేను లేడీస్ హాస్టలకి వెళ్లానన్న ఆదివారం కాదు దానితో కలుపుకుంటే ఇదిమూడో ఆదివారం.

సాయంకాలం రామకృష్ణాబీచ్‌లో కూర్చుని నేను, గీత కబుర్లు చెప్పుకుంటున్నాం. సాహిత్యానికి సంబంధించినవి కావు పిచ్చాపాటి

గీతలో మగాణ్ని ఆకట్టుకొనే ఆకర్షణుంది. మనిషిలోనే కాదు. మాటలోకూడా. అందుకే పరిచయమైన నాటినుండి ఆమెతో గడపడానికి అవకాశ మున్న అయిదు రోజులూ (మూడు ఆదివారాలు, రెండు బుధవారాలు కలిపి. అసలా ఆంధ్రాయూనివర్సిటీ లేడీస్ హాస్టల్‌కి ఆరెండు వారాలుమాత్రమే విజటింగ్ డేస్ అయినా ఇన్నికథలు పుడుతున్నాయి. అన్నివారాలు అయితే మరెన్ని పుట్టునో కదా!) ఇతంవ్యాపకాలేం లేకుండా బుద్ధిమంతుడిలా లేడీస్ హాస్టల్‌లో హాజరు వేయించుకుంటున్నాను. మొదటి రెండు సమావేశాల్లోనూ శైల కూడా మాతోపాట్లోనేది అతర్వాత గీత, నేను ముళ్ళపూడి వెంకటరమణగారి డబ్బాల్లో రెండవదాన్ని (అనగాపరస్పర డబ్బాని) వాడుకుంటున్నామనో గీతకూ, నాకూ మధ్య సంభాషణలో తనకి

చోటు దొరకడం లేదనో— కావా
లని గీత తప్పించుకు వచ్చేదో
కారణాలేవైతేనేం కథ బెడిసింది.
ఆమెమాతో కూర్చోవడంమానేసింది
ఒకటి రెండు సార్లు విజటర్స్
లిస్టులో పేర్రాసి గేటు దగ్గర
వెయిట్ చేస్తోండగా శైల వచ్చి,
గీతకోసమా? పిలుస్తా నుండండి,
అని చెప్పి వెళ్ళిపోయింది. గీత
దగ్గర ఆతర్వాత శైల ప్రసక్తి తీసు
కొచ్చినా సరైన జవాబులేకుండా
చిత్రంగా టాపిక్ మార్చేసింది.
క్లాసులో అవకాశం వచ్చినపుడు
ఒకటి రెండు సార్లు, ఆయనకు
క్లాసులో అమ్మాయిలెలా తెలుస్తారు.
ఇతర డిపార్ట్ మెంటువాళ్ళు సన్ని
హితులై పోయినప్పుడు, అని జోక్
చేసేది శైల. మొత్తానికేదో వుందను
కున్నాను ఏమైనా ఆడపిల్ల హృద
యంలోతుల్లోంచి దాన్ని తవ్వడం
కష్టమని ఆ ప్రయత్నం విరమించాను

"మనగురించి మీ కొలీగ్స్ కథ
లల్లేస్తున్నారు, నల్లనిజడ ముందుకు
వేసుకొని కొసవిప్పి అల్లుకొంటూ
నాకళ్ళలోకి చూసింది గీత.

"అబ్బాయిలా? అమ్మాయిలా?"
నాచూపులు ఆమె జడ అల్లికను
విప్పేంత నిశితంగా పన్చేస్తున్నాయి.

"అమ్మాయిలే. అసూయ ఆడ
దానికి తోబుట్టువనే మాటఅక్షరాలా
నిజం. ఈ లేడీస్ హాస్టలులో రాజ
కీయాలు చూస్తే మీకు నిజంగా
మతిపోతుంది. ఇప్పుడు మీమీద
ఆవీ యివీ చెప్పుకొనే అమ్మాయిలే
మిమ్మల్నోసారి పరిచయం చేస్తే
చాలు మళ్ళీ మీఅంత మంచివాళ్ళు
లేరంటారు...."

"నాకో మంచి సబ్జక్టు ఇస్తు
న్నారు అనుకోకుండా. థేంక్స్"

"కొంపదీసి వాళ్ళందరి పేర్లు
పెట్టి కథగాని రాసెయ్యకండి. ఇప్ప
టికే ఏడిచ్చస్తున్నారు ఎవరెలా
ఏడ్చినా నేను పట్టించు కోనను
కోండి. మనం ఒక ఫామిలీమెంబ
ర్స్గా ఉంటున్నప్పుడు సమాజానికి
భయపడ వలసిన అవసరంలేదు"
ఇసకలో చూపుడు వేలితో ఏదో
రాస్తోంది. (ఇంటి దగ్గర ముగ్గు
లెట్టడం బాగా అలవాటేమో!)

"మీధైర్యాన్ని మెచ్చుకుంటు
న్నాను అంతకు మించి మాత్రం
సంబంధాలు కలపకండి సమాజం
కోసం కప్పుకొనే ఈవిలువల బుర
ఖాలుమీద నాకు నమ్మకంలేదు.
నిజమైన అభిమానం ఈ విలువల

కల్పితమనీ, ఈ కృత్రిమ బంధాల కంటె స్నేహ మహత్తరమైనదనీ నా అభిప్రాయం" సెంటిమెంట్స్‌కి సంబంధించిన విషయాలు మాట్లాడే టప్పుడుసిన్సియారిటీ నామొహంలో సిన్సియర్‌గా కన్పడుతుంది.

" నేను కూడాఅంతే. ఉయ్ ఆర్ బర్డ్స్ ఆఫ్ ది సేమఫెదర్. అన్నట్టు మొన్న బుధవారం మీరు రిటర్న్ చేసిన నాకథ సారీ మీకథ...."

" ఇట్స్ టూ మచ్"

" పోనీ మనకథ 'ఒకే గూటి పక్షులు' చాలా బావుంది. మీరిలా కరక్ట్‌చేసి పెట్టేస్తోంటే నేనుకూడా గొప్ప కథలు రాయగలననే నమ్మకంఎక్కువై పోతోంది. ఆకథ పబ్లిష్ అయితే క్రెడిట్ అంతా మీదే"

" కాకపోతే మంచి కథకాదనా మీ అభిప్రాయం" కావాలని కాక పోయినా సీనియారిటీని ప్రదర్శించాను

" అదికాదు స్వామీ నాభావం. పబ్లిష్ అయినప్పుడు, నలుగురూ మెచ్చుకున్నప్పుడు– ఆ క్రెడిట్ అంటున్నాను. అబ్బ! నామాటలకే నేను 'ఇంటర్ ప్రిటేషన్' ఇచ్చుకో వాల్సొస్తోంది ఇంక కథ లేం రాస్తాను ' ఇచ్చట కథలు మరమ్మత్తు చేయబడును' అని మీరో బోర్డు కట్టేస్తే మాలాంటి వాళ్ళం బాగు పడతాం"

" అయితే ఈ కథకేం ఫీజు మరి? యధాలాపంగా అడిగాను. అంతే గాని సినిమాహీరోలాగ గీతనుంచి మరేదో ఆశించి కాదు.

" సిన్మాకెళ్దాం" సంధ్యాకాంతులు పడక పోయినా గీత కళ్ళెప్పుడూ మెరుస్తూనే వుంటాయి అందులోనూ కనుబొమ ఎగరేస్తే ఎక్కుపెట్టిన విల్లులా మరింతగా గగుర్పాటు కలిగిస్తాయి.

"నో నో. సరదా కన్నాను"

" నేనుకూడా సరదాగానే అమ్మం టున్నాను. (అంటే ఏడుస్తూ కాదనా?) జగదాంబలో 'ఎయిర్ పోర్టు' ఇవాళే - ఆఖరిరోజు. అంకే మీకు ఛాయిస్ ఇవ్వడం లేదు. ఇది 'ఫీజుకాదులెండి. కంపెనీ కోసం మీరు రావాలి తప్పదు అంతే"

నామాట వినిపించుకోకుండా ఇసకలో పరిగెట్టినంత వేగంగా

నడుస్తోంది– (అప్పుడు నేనేంహడావిడి చేసినా జనం అపార్థం చేసుకోవచ్చు) కనుక ఆమె వెనుక నేను

* * *

అవుట్ గేట్ దగ్గర 'నెంబర్ టెన్' కోసం పడిగాపులు కాస్తున్న నాపక్కనే స్కూటరాగిన శబ్దం– వాసు.

"టౌన్ కొస్తారా?"

అవునన్నట్టు తలూపాను.

"రండి, పోదాం"

"థ్యాంక్యూ" స్కూటరు ముందుకు దూసుకు పోతోంది.

"ఈమధ్య మీదర్శనమే కరువయ్యింది" అన్నాడు వాసు ఆర్ట్సు కాలేజీ ప్రాంతంలోని 'వెరైకలర్' కేసి చూస్తున్న నన్ను డిస్టర్బ్ చేస్తూ (టెక్నికలరూ, ఈస్ట్మన్ కలరూ దీనిముందుదు దిగదుడుపని యూనివర్సిటీ అబ్బాయిల అభిప్రాయం!)

"అవును.... రావడం లేదండీ

అది అతను ఆశించిన సమాధానం కాదు. కాని తడబాటులో అంతకంటె వేరే మాటలు దొరకలేదు.

అతను కూడా నాపరాకును గుర్తించి నట్టున్నాడు మళ్ళీ మాటాడలేదు. 'అప్సరా' వరకు వెళ్ళిన తర్వాత మాత్రం ఆవారంలో అచ్చయిననారచన గురించి ఏదో అన్నట్టుగుర్తు.

సూపర్ బజార్ దగ్గరదిగాడు, ఎంత వరకు వెళ్తారని.

'ఇక్కడ దిగిపోతాను. షాపింగ్ కని....'

'రండి, కాఫీ తాగి వెళ్దురుగాని' స్కూటర్ పార్క్ చేస్తున్నాడు నేను మొహమాట పడుతున్నాను.

'నమస్కారం' వెనకనుంచి పరిచయమైన గొంతు.

'నమస్తే' అనేసి వెనక్కు తిరిగి చూశాను. సూపరుబజారునుంచి గీత మరో అమ్మాయిని వెంటేసుకొని వస్తుంది ఆరెండో అమ్మాయిని గీతలో రెండుమూడుసార్లు చూశాను

'ఇది తెలుసుకదూ. మాకొలీగ్. మిమ్మల్ని వేరేపరిచయం చెయ్యనక్కరలేదు.'

'బైదిబై ఈయన వాసు బి.ఓ.క్ ప్రీఫైనల్. సాహిత్యమంటే మంచి ఇంట్రెస్టుంది. ఈవిడ గీత కథలూ అవీరాస్తుంటారు. తెలుగుప్రీవియస్.

నమస్కారాలు, ప్రతినమస్కారాలూ....

'ఏమిటలా చూస్తున్నారు' తన కేసి పరిశీలనగా చూస్తున్న వాసు కేసి చూస్తూ అడిగింది గీత.

'మిమ్మల్నెక్కడో చూసిన గుర్తు' వాసు ఆలోచిస్తున్నాడు.

'ఎగ్జాక్ట్లీ, నేనుకూడా అదే అనుకుంటున్నాను'

"మీరు కాకినాడ ఉమెన్స్ కాలేజీలో చదివారా?'

'అవును, బియస్సి వరకు అక్కడే మీకెలా తెలుసు?'

"నేను పి ఆర్ జి సిలో పి.యు సి.చదివాను జగన్నాధపురంలో బంధువులింట్లో వుండేవాణ్ని అప్పుడు చూశాను. మొన్న స్టేట్ బాంక్ దగ్గర మిమ్మల్ని చూసి ఎక్కడో చూసినట్లుందే అనుకున్నాను గాని గుర్తు రాలేదు పలకరించి అడుగుదామనుకున్నాను గాని బావుండదని మానేశాను"

ఈ బాదరాయణ సంబంధం ఇప్పట్లో ఆగేలా లేదు కాఫీకి వాళ్ళను కూడా పిలుద్దామంటే వాసు ఏమనుకుంటాడో....

"సారీ. సుజా, నీకు బోరు కొడుతున్నట్టుంది. మళ్ళీకలుద్దాములెండీ...." గీత రెండడుగులు ముందుకు వేసింది

"ఆగండి కాఫీ తీసుకు వెళ్దురు గాని" వాసు ఈమాత్రం గౌరవాన్ని ప్రదర్శిస్తాడని నాకుముందే తెలుసు

"థాంక్స్ ఇప్పుడే తీసుకున్నాం మొహమాట మనుకుంటున్నారా. కావాలంటే సుజానుకూడా అడగండి

"అవునండీ" అంది ఆఅమ్మాయి పెదవుల మీదే సిగ్గునంతా ఒంపేసుకొని.

"వస్తామండీ. వచ్చే ఆదివారం తప్పనిసరిగా రండి మీతో చాలా అర్జంటు పనుంది వీలుంటే మీరు కూడా రండి వాసుగారు. కాకినాడ కబుర్లు చెప్పుకోవచ్చు" అంటూ సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయింది గీత

"సరే ఇంకెలా కనిపిస్తారు." మీరు " చిన్నగా నవ్వుతూ కేంటీన్ కి దారితీశాడు వాసు

కాఫీ సిప్ చేస్తూ అన్నాడు వాసు "అదృష్ట వంతులు.... అందమైన కధలాసే అమ్మాయి స్నేహం...."

"కాదు... కధలాసే అందమైన అమ్మాయి" అన్నాను. గీతను చదివిన తర్వాత నాకేర్పడిన ఖచ్చితమైన అభిప్రాయం అది!

* * *

హాఫియర్లీ పరీక్షలువూర్తయ్యాయి 'ఇంప్రెషన్' కోసం గట్టిగా కృషి చెయ్యక తప్పలేదు గీతతో మాట్లాడి నెల్లాళ్లు కావస్తోంది శైల చేత కబురు పెట్టింది- ఓసారి హాస్టల్‌కి రమ్మని....

ఆమధ్య సిటిబస్‌లో కనిపించి హాయ్. మరీ కంట్లో నలుసైపోయారు' అంది గీత ఓచిరునవ్వు విసిరేస్తూ కాని అపలకరింపులో ఏదో వెలితి కనిపించింది నాకు. ఫార్మాలిటీ కోసమే అన్నట్టు, ఇది వరకటి ఆత్మీయత లోపించినట్టు అనిపించింది

తర్వాత ఒకటి రెండుసార్లు శైల కూడా అడిగింది 'ఈ మధ్య మీరు హాస్టలుకి రావడం మానేసారే?' అని ఆపరామర్శలో హృదయాన్ని కలుక్కుమనిపించే అవహేళన.

"సీరియస్‌గా చదివేస్తున్నా 'రాంక్' పోతుందని!" యూనివర్సిటీ స్థాయిలో కొలీగ్స్‌ని ఏడిపించడానికి అంతకంటె పదునైన అస్త్రంలేదు.

"మీకేమండి?- క్లాస్ స్టూడెంట్స్" మొహం మొగ్గలా ముడుచుకుంటే చూడ్డానికి మరింత అందంగా ఉంటుంది శైల.

మరోసారి మాటల సందర్భంలో మీడ్యూటీ మీరాజేష్ ఉన్నారిక్క అప్పగించేరేంటీ మధ్య?' అనిడిగింది.

-తెల్లమొహం వేశాను- క్లాసులో పాఠం అర్ధంకాక నిల్చున్న విద్యార్థిలా!

"ఓ! సారీ!- మీకు తెలియదనుకుంటాను. మీరేం అనుకోనంటే చెప్తాను మరి." ఊరిస్తోంది.

" నాటెటాల్- చెప్పండి" అన్నాను ఆశ్చర్యపడుతూ.

'మీ ఇంజనీరింగ్ ఫ్రెండ్ లేరు: అదే! మీకోసం వెస్పామీద వస్తుంటారు ఆయన పేరెలాగూ తెలియదు గనుక హాస్టలంతా ఆపేరే

పాపులర్ అయిపోయింది. దయచేసి ఆయనతో మాత్రంచెప్పకండి'

'ఛా!ఛా!' అన్నాను పైకి చెపితే నిజంగా. వాస ఎగిరిగంతెయ్యడూ? అంత వరకు లేడీస్ హాస్టల్ వాస నైనా తెలీనివాడు నావ్యమా అని ఇంతమంది అమ్మాయిల్లో ఏకైక నాయకుడిలా వెలిగి పోతున్నాడన్న మాట వాసు పెర్సనాలిటీని గురించి శంకించాల్సిన అవసరం లేదుకాని సౌత్ కాంపస్‌లో' కూడా అమాత్రం అందగాళ్ళు లేకపోలేదు. ఎటొచ్చీ ఔదార్యం దర్జా ప్రదర్శించడానికి తగిన అర్థికబలం ఉన్నవాళ్ళు మాత్రం అరుదు. ఆడపిల్లల మోజు అర్థమయింది– 'ఎంతటి నెరజాణలు....'

వాసుని చూసిన వాళ్ళు ఎవరైనా అనుకుంటారు అతను ఉన్నవాడని. అదే నేనూ అనుకున్నాను- నేను యూనివర్సిటీకి వచ్చినకొత్తలో ఏదోసాహిత్య సమావేశంలో అతను పరిచయమైన మొదటి సారి. ఆ తర్వాత ఎవరో చెప్పారు- అతని డాడీ శ్రీమంతుడే కాకుండా స్టేట్ లెవెల్లో గొప్ప పలుకుబడి గల వ్యక్తి అనీ- యూనివర్సిటీలో తన ఇంప్లుయెన్స్ నుపయోగించే మహా అయితే థర్డ్ క్లాస్‌లో పాసవ్వాల్సిన వాసుకి డిస్టింక్షన్ మార్కులు వేయించాడనీ! 'హారా! అని ఆశ్చర్యపోలేదు నేను –ఆహా! అన్నాను. దరిమిలా పదీ పరకా అవసరమైనప్పుడు ఆదుకొనే వాడు గనుక వాసుకీ నాకూ మధ్య స్నేహం బాగా బలిసింది

వాసునుంచి ఆలోచనలు గీత మీదకు మళ్ళాయి. గీత పరిచయమైన మొదట్లో ఆమె గురించి నేను పెద్దగా ఊహించ లేదు గాని తర్వాత కొంచెం గొప్ప పరచుకు తిరిగే వాళ్ళి. కారణం గీతతో మాట్లాడితే చాలు జన్మ ధన్యమైంది. అనుకునే అబ్బాయిలు కోకొల్లలున్నారన్న సంగతి నాకు తెలియడం– ఆమె నేనెక్కడ కనిపించినా పలకరించడం చూసి నలుగురూ చెప్పులు కొరుక్కోవడం నా పెర్సనాలిటీ మీద నాకే అనుమానమొచ్చింది. నిలువుటద్దం లో (హాస్టల్లో నిలువుటద్దాలు కూడానా!- బజార్లో నడుస్తూ ఓసారి జోళ్ళ షాపు ఎదురుగా ఆగి ఏవీ తెలియనట్టు నిల్చొని) చూసుకున్నాను. ఫర్వాలేదు సెకండ్ క్లాసు మార్కులైనా వస్తాయను

కున్నాను. గీతతో స్నేహం గర్వ కారణమే అయింది నాకు అలాంటిది—గీత కిప్పుడు వాసు మీదకి గాలి మళ్ళిందన్న మాట. ఆడపిల్లలెంత చపల చిత్తలు!

వాసుని గీతకు పరిచయం చెయ్యడం పొరపాటయ్యింది. నేను చెయ్యకుండా ఉండి ఉంటేనో: (చేసి తీరాలి- అలా రాసి పెట్టి వుంది, అంటారు కర్మసిద్ధాంతులు. అది నమ్మడమే మేలు. మన పొరపాటు కాదన్న తృప్తైనా మిగుల్తుంది) వాసు గీతకు నాకంటె సన్నిహితుడై పోతున్నాడన్న దుగ్ధ -! నేనెంత స్వార్థపరుణ్ని!

ఇంతకుముందు రెండు మూడు సార్లడిగింది. గీత (అదే-నేను మాట్లాడితే చాలు అనుకునే కొత్తలో) మీవూరు వస్తానని మరో వారం రోజుల్లో సెలవులిస్తారు గనుక ఆ అవకాశాన్నిప్పుడు వినియోగించుకోవాలి. వాసుని మర్చిపోయ్యేట్టు చేసి- మామధ్య మళ్ళీ పూర్వపు సాన్నిహిత్యాన్ని నెలకొల్పుకోవాలి.

"మీ గీత కోసమా వచ్చారు" శైల అడుగుతోంది 'మీ' మీద స్ట్రెస్ ఇస్తూ. అప్పుడు గుర్తుకొచ్చింది నెంబర్ టెన్ దిగి పావుగంటయినా యాంత్రికంగా గేటుదగ్గర కొచ్చి ఆలోచిస్తూ నిల్చుండి పోయానని!

సిగ్గుపడుతూ అవునన్నట్టు తలూపాను.

"సారీ! రాజేష్ అన్నాగారితో వెస్పామీద అరగంట క్రితం వెళ్ళిపోయింది"

ఛెళ్ళున చరిచినట్టయింది!

* * *

మర్నాడు లైబ్రరీనుంచి బయటకు వస్తుంటే గీత ఎదురు పడింది పలకరించ కూడదనుకొని కావాలని చూడనట్టు తలవంచుకొని వెళ్ళిపోతున్నాను.

"హలో. ఏమిటలా వెళ్ళిపోతున్నారు. మాట్లాడకుండా. నామీద కోపమొచ్చిందా?" అపలకరింపుతోనే నిన్నటి కోపాన్ని సగంవరకు తగ్గించింది

"అబ్బే! కోపం రావడానికి మేమెంత వాళ్ళం" అన్నాను లేని బిగువును ప్రదర్శిస్తూ

"వెరీసారీ. నిన్న డిజప్పాయింట్ చేశాను మిమ్మల్ని. అన్నయ్య వచ్చి వాళ్ళ చుట్టాలింటికి వెళ్దామని బల వంతంచేస్తే కాదనలేక పోయాను."

అయ్!- ఎంత గుండెధైర్యం! అబద్ధం కూడానా! దాచుకుంటున్నా ఆగని కోపం ముఖంనిండా రోజ్ పౌడర్‌లా అలముకొంది.

"వాసుతో వెళ్ళినట్టు చెప్పారు శైల?" (ఇక్కడ బహువచనం ఉపయోగించక పోతే వాళ్ళకి కోప మొస్తుంది. ఇదివరకెప్పుడో సుశీల అనే అమ్మాయి నా మొహం మీదే అంది మీ అబ్బాయిలంతా మొహం మీద 'మీరు-గీరు' అంటారు. వెనక 'అది-ఇది' అంటారని!)

"ఓహ్ మీకు తెలియదన్న మాట- అన్నయ్యంటే ఎవరను కున్నారు. వాసుయే."

ఈసారి కూడా ఆశ్చర్యపడ్డం నావంతే అయింది. పరిచయ మైన కొత్తలో ఓసారి 'బీచ్‌లో కూర్చొని ఇలాంటి సంబంధాల గురించి నా అభిప్రాయం చెప్పి నప్పుడు 'ఉయ ఆర్ బర్డ్స్ ఆఫ్‌ది సేమ్ ఫెదర్' అన్న అమ్మాయేనా ఈమె? ఈగీత వెనుకటి గీత కాదనిపించింది

"ఇలాంటి పిలుపులు మీకిష్ట ముండదు కదూ- వాసుని ఎన్ని సార్లు మందలించినా 'చెల్లాయ్' అనే పిలుస్తాడు. నాకూ కూడా అల వాటయి పోయింది. ఈమధ్య మీరు రానందుకు అతని కంపెనీతో బాగా కాలక్షేపమవుతుంది. అన్నట్టు అతను మావాళ్ళే తెలుసా?" అందంగా జేబురుమాలు ముడి వేస్తోంది.

'అలాగా' అన్నాను. అంటే ఒకటేకులం అని అవిడ అభిప్రాయం వాళ్ళసాన్నిహిత్యానికి అదికూడా కారణం కావచ్చు. వేదికలమీద, రచనల్లోనూ అపురూపంగా కని పిస్తున్న కులతత్త్వం రాజకీయాలూ, విద్యాసంస్థలూ చాలక సాహిత్య రంగంలో కూడా చోటుచేసు కుందన్న విషయం గొప్ప ఓపెన్ సీక్రెట్ అలాంటి - ఉన్న ఊళ్ళకు దూరంగా ఒకే విశ్వ విద్యా లయంలో చదువు కుంటున్న అమ్మాయి అబ్బాయి చేరు వయ్యారంటే ఆశ్చర్యమేముంది!

"సెలవల్లో ఇక్కడే ఉంటారా?"

" లేదు- ఊరికెడుతున్నాను"

" అయితే మళ్ళీ చాన్నాళ్ళు

కనిపించరన్న మాట. వెళ్ళేముందు మళ్ళీ కలుస్తారుగా!" జవాబుకోసం యిచ్ చెయ్యకుండా 'హలో రాజీ' అంటూ ఎవరో అమ్మాయిని విష్ చేస్తూ వెళ్ళిపోయింది.

* * *

థర్డ్ టరమ్ లో ఎదురైతే పలకరించడం తప్పిస్తే నాకూ గీతకూ మధ్య రాకపోకలన్నీ నిలిచి పోయాయి చెప్పుకోదగ్గ కారణమేవీ లేదుకాని ఎవరితోనైనా అంటీ అంటనట్టుగా 'పోజ్' కొడుతూ తిరిగితేనే 'మోజు' ఉంటుందనీ 'ఆత్మీయత' తో చేరబడి తిరిగితే తేలికైపోతామని గీతతో నాకున్న అనుభవం దృష్ట్యానేనో అభిప్రాయా న్నేర్పరుచుకున్నాను

ఈ మధ్యక్లాసుకి సంబధించిన వివిషయాలను బట్టి శైల నాక్కొంచె దగ్గరయింది. మరీ ఆత్మీయతను నింపుకొని మాట్లాడుకొంటున్న మూడ్ లో ఒక రహస్యం చెప్పింది కూడాను. అమ్మాయిలంతా గీతకూ నాకూమధ్య ప్రణయం ప్రళయంగా మారిందనీ అందుకే నేనుహాస్టలుకి రావడం లేదనీ అనుకుంటున్నారట. అప్పనుమరి! వాసు చెల్లాయనైనా పిలుస్తాడు. నేనలాకూడా పిలవనుగా! "మాఅన్నయ్య మాఅన్నయ్య అని ఎగిరి పడిపోతుంది గీత- ఆరాజేష్ అన్నాగారి గురించి వీళ్ళకేదైనా చుట్టరిక ముందా?" అనికూడా అడిగిందో సారి.

" ఆసందేహమెందు కొచ్చింది?" అన్నాను

" వాళ్ళిద్దరూ ఎవరూ అనుమానించకుండా అలా చెప్పుకుంటున్నారు గాని- వాళ్ళు ప్రేమికులని కొంతమంది అమ్మాయిలఅనుమానం

దారుణమైన అనుమానం!- ఊహించడానికే భయంకరమైన అనుమానం!

" నేననుకోను" అన్నాను నిర్లిప్తంగా.

వాసుకి నాకు మధ్య రాకపోకల్లో పెద్దమార్పేంలేదు. విచిత్ర మేమిటంటే- గంటలు తరబడి మాట్లాడుకున్నా గీత ప్రసక్తి వచ్చేది కాదు!

హాస్టలు వాలిడిక్టరీ ఫంక్షన్ 'ఫీస్ట్ కి' ఫార్మల్ గా గీతనుపిల్చాను.

మగాళ్ళ మధ్యకు రావడం తనకంత ఇష్టముండదని ఏపీ అనుకోవద్దనీ-ముందే చెప్పింది. నేను కూడా అంత పట్టించు కోలేదు. అతర్వాత వాసు ఫీ'స్ట్' కిపిలిస్తే వెళ్ళినట్టు శైల చెప్పింది- C నార్త్‌కాంపస్' లో బొత్తిగా కలర్ ఉండకపోతే జనం బాధపడతారని జాలి తల్చి వెళ్ళిందేమో!)

సెలవల్లో మాదగ్గర బంధువులమ్మాయి పెళ్ళికి అన్నవరం వెళ్ళాను.

ముహూర్తం రాత్రి పన్నెండు చిల్లరకు యూనివర్సిటీలో చదివిన రెండేళ్ళలో ముప్పైమూడు సార్లు అన్నవరంమీదుగా బస్‌వెళ్ళినా (పైగా భక్తులు కొబ్బరి కాయలు కొట్టడంకోసమని- ఓపదినిముషాలు బస్సు ఆపుతారు కూడా ఇక్కడ!) ఎప్పుడూ లోపలకు వెళ్ళి చూడలేదు నేను పుణ్యంవచ్చినా రాకపోయినా పాపం ఏమీ చుట్టుకోదు అనే ధైర్యంతో ముహుర్తంవేళయ్యే పరికి చుట్టూ ఓసారి ప్రదక్షిణం చేసి వద్దామని బయల్దేరాను.

అందమైన టీనేజ్ గర్ల్ చిరునవ్వులా వుంది ఆకాశం నిండా పరచుకున్న వెన్నెల.

మొదటిరాత్రి ప్రియురాలి చూపుతోనే పరవశించి పోతున్న ప్రియుడిలా పంపానదీ జలాలు పాల వెన్నెల్లో మెరుస్తున్నాయి అక్కడి ప్రకృతికి ముగ్ధుణ్ణవుతూ సిగరెట్టు వెలిగించి రిజర్వాయర్ దగ్గర కూర్చున్నాను.

ఏదో అలికిడయితే చూశాను-రిజర్వాయర్ కేసి వస్తున్న ఇద్దరు యువతీ యువకులు (ఏజెండాఎత్తి వచ్చిన సరుకో కాదు కదా? ఇలాంటి అదృష్టాన్ని వదులు కోవద్దని మిత్రుడు గంగిరెడ్డి చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది) నన్ను చూసి ఆగిపోయారు కుతూహలంతో మరింత పరీక్షగా చూశాను-వాసు. గీతా!

'వాసూ!' వెనుదిరిగి వెళ్ళిపోతున్నవాళ్ళను ఒక్క ఉదుటున వెళ్ళి చేరుకున్నాను.

"అరే! మీరా. ఎవరో అనుకున్నాం. ఏవిటిలా వచ్చారు."

"మాబంధువులమ్మాయి పెళ్ళి. మీరు పెళ్ళికొడుకు తరపునకాని రాలేదు కదా?"

"సరిగ్గా సమయాని కొచ్చారు. మీకోసర్ప్రైజింగ్ న్యూస్ చెవుతున్నా మూడు ఇరవయ్యేదుకి మామారేజ్. సారీ! వెడ్డింగ్ కార్డ్స్ పంపడానికి వీలుకాలేదు. మాకు దూరవు బంధుత్వముందట. పెద్దాళ్ళు అనుకోకుండా మేచ్ సెటిల్ చేసి వ్యవధి లేకుండా ముహూర్తం పెట్టేశారు: "వాసు చెప్పుకు పోతున్నాడు. గీత పెళ్ళికూతురు కనుక సిగ్గుపడిపోతోంది!

ఇంకేం చెప్పినా వినిపించుకునే స్థితిలోలేను. 'వాసు' గీత- వధూవరులు....! భయంకరమైన నిజం!: నన్ను నేనే నమ్మలేక పోతున్నాను!

కలయో!- నిజమో!- వైష్ణవ మాయయో!- అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి వారి మహత్యమో!

- 0 -


Estd 1972 2164

విపంచి పాఠకులకు మా శుభాకాంక్షలు!

తప్పక దయచేయండి!!

# సేవా సదన్

## మెయిన్‌రోడ్డు. విశాఖపట్నం.

**బ్రాంచీలు :** అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, విజయనగరం(2)

విశాఖపట్నం జిల్లాలో గృహోపకరణములు సప్లయి చేయుటలో ప్రసిద్ధి చెందిన సంస్థ

మావద్ద అన్ని రకముల గృహోపయోగ వస్తువులు రేడియోలు, సోఫాకమ్ బెడ్సు, ఫర్నిచరు, స్టీలు సామానులు వాయిదాలు పద్ధతిపైన తదితర స్కీముల ద్వారా లభించును.

కె. అప్పారావు & నారాయణ్
(ప్రొప్రయిటర్స్)

త్వరలోనే యలమంచిలి,S.కోటలలో మాబ్రాంచీలు తెరువబడును.